# నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేస్తాం

- శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి, జనవరి 4 : వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మర్పల్లిలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సభాపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో సాధ్యమైనంత వరకు అర్హులైన ప్రతిఒక్కరూ ఆరో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రస్తుతం అందుబాటులో లేనివారికి తిరిగి నాలుగు నెలల తర్వాత దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. లబ్ధిదారులకు నష్టం వాటిల్లకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 98 చెక్కులను అందజేశారు. భవిష్యత్తులో రూ.లక్షా116లతో పాటు తులం బంగారం లేదా రూ.లక్షాఅరవైవేల చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి పేద ఇంటికీ చేరేలా అమలుచేస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు లేనివారు కూడా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

### రోడ్ల నిర్మాణ పనులకు రూ.300 కోట్లు

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రెండు లక్షల రూపాయల రుణమాఫీని చేపడుతామని, రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15 వేల రూపాయల చొప్పున అందిస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం కౌలు రైతులకు కూడా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అందించే బాధ్యత తనపై ఉందని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని రోడ్ల ఏర్పాటుకు 300 కోట్లు నిధులను కేటాయించనున్నట్లు తెలిపారు. అదనంగా రోడ్ల నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వానికి రూ.150 కోట్లు మంజూరుకై ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రజా పాలన గ్రామసభ అనంతరం కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

కార్యక్రమంలో ఆర్డీవో విజయకుమారి, డీఎల్పీవో అనిత, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో అనిత, ఎంపీపీ లలిత, జడ్పీటీసీ మధుకర్, సర్పంచ్ మహబూబాబీ, ఎంపీటీసీ సంగీత, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, నాయకులు రవీందర్, రాములు యాదవ్, ఖలీమొద్దీన్, ఫసియోద్దీన్, రమేశ్వర్, సురేశ్, శేఖర్ యాదవ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిశీలన



పెద్దఅంబర్‌పేటలో దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, జనవరి 4 : దరఖాస్తులు స్వీకరించే సమయంలో అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ సెంటర్‌ను, దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును గురువారం ఆయన పరిశీలించారు. దరఖాస్తులు స్వీకరణ తర్వాత నమోదు చేస్తున్న తీరుపై అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## మహేశ్వరం డీసీపీగా సుమతిరెడ్డి



ఇబ్రహీంపట్నం, జనవరి 4 : రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం డీసీపీగా సుమతిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు డీజీపీ రవిగుప్తా బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నార్కోటెక్ ఎస్పీగా ఉన్న సుమతిరెడ్డిని మహేశ్వరం డీసీపీగా బదిలీ చేశారు. గతంలో ఇక్కడ డీసీపీగా పనిచేసిన శ్రీనివాస్‌ను రాజేంద్రనగర్ డీసీపీగా బదిలీ చేశారు.



ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## ఆకస్మిక తనిఖీ

వికారాబాద్, జనవరి 4 : ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీల కింద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న తీరును వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. గురువారం ఆయన వికారాబాద్ మండలం అత్వెల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు హాజరై తనిఖీ చేశారు. ప్రజలు సమర్పిస్తున్న దరఖాస్తులతోపాటు, బృందాలు నిర్వహిస్తున్న కౌంటర్లు, ఆయా పథకాల కింద వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను తప్పులు లేకుండా రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూపొందించిన ఒకే ఒక దరఖాస్తుతో అన్ని గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట వికారాబాద్ స్పెషల్ ఆఫీసర్ సుభాషిణి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

## గిరిజన, బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రత్యేక పరీక్ష

### వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ శశాంక, అధికారులు

ఇబ్రహీంపట్నం, జనవరి 4 : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల, గిరిజన గురుకుల, బీసీ గురుకులాలతో పాటు జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నందున ఈ అవకాశాన్ని 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రవేశపరీక్షకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలకు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, కందుకూరు ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు, శంషాబాద్ ప్రిన్సిపాల్ యాదయ్య ఉన్నారు.



ప్రవేశ పరీక్ష గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

## తొలిమెట్టు అమలు.. భేష్

- విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందేలా బోధన
- ఉపాధ్యాయులను అభినందించిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

ధారూరు, జనవరి 4 : ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్) భేషుగ్గా అమలు చేస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కొనియాడారు. గురువారం ధారూరు మండలం కాచారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివానితో వీడియో కాల్‌లో మాట్లాడారు. విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా, వారిలో నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక పద్ధతుల్లో విద్యాబోధన చేయడాన్ని అభినందించారు. వీడియో కాల్ చేసి విద్యార్థులతో సునీతారెడ్డి మాట్లాడారు. టీఎల్ఎం పద్ధతిలో చెప్పే విద్యాబోధనతో పాఠాలు బాగా అర్థమవుతున్నాయని విద్యార్థులు సునీతారెడ్డికి తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలని ఆమె సూచించారు. మొదటి రెండు తరగతుల విద్యార్థులు కూడా ఇంగ్లిష్ భాషలో మాట్లాడడంపై సునీతారెడ్డి ముగ్ధురాలయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన లభిస్తుందనడానికి కాచారం పాఠశాలనే నిదర్శమని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు శివానిని, ఉపాధ్యాయురాలు అనురాధను ప్రత్యేకంగా అభినందించారు.



ప్లే కార్డుల ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

## దరఖాస్తుల సేకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

### డీపీవో తరుణ్‌కుమార్



తిర్మలాపూర్‌లో అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో డీపీవో తరుణ్‌కుమార్

కులకచర్ల, డిసెంబర్ 30 : గ్రామాల్లో అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం నిర్వహిస్తున్న దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని వికారాబాద్ డీపీవో తరుణ్‌కుమార్ అన్నారు. గురువారం కులకచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైనవారు దరఖాస్తు చేసుకునేందుకు అభయహస్తం ఫారాలను అందజేయాలని సూచించారు. తెలియనివారికి తెలియజేసి దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు. దీనికిగాను అవసరం మేరకు కౌంటర్లను ఏర్పాటు చేసుకొని ప్రశాంతంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సేకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. కులకచర్ల ఎంపీపీ సత్య హరిశ్చంద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ 2 అధ్యక్షుడు భరత్‌కుమార్, సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కరీం, అధికారులు, నాయకులు మొగులయ్య, వెంకటయ్యగౌడ్, చిన్నయ్య పాల్గొన్నారు.

ఘనాపూర్‌లో అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో నిర్వహించిన అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఆర్ఐ లింగప్ప, నాయకులు సలీం, రాము, వెంకట్, పంచాయతీ కార్యదర్శి మహేశ్‌రెడ్డి, ఈర్లవాగు తండా సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు. చాకల్‌పల్లిలో సర్పంచ్ రాములమ్మ ఆధ్వర్యంలో అభయహస్తం దరఖాస్తుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగయ్య పాల్గొన్నారు.

## చెంచుల అభ్యున్నతికి కృషి

### తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు

పెద్దేముల్, జనవరి 4 : చెంచులకు కనీస సౌకర్యాలను కల్పిస్తూ.. వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని చైతన్యనగర్ గ్రామాన్ని సందర్శించి ఆర్డీవో స్థానికులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు 'పీఎం జన్‌మన్' కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు రకాల పథకాలను చెంచు కుటుంబాలు, ఆదివాసీ కుటుంబాలకు వీలైనంత త్వరగా అందించడంలో భాగంగా ఆధార్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు గ్రామంలో తాత్కాలిక మీ–సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజూరెడ్డి, విద్యుత్ ఏడీఈ ఆదినారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాణి, డాక్టర్ బుచ్చిబాబు, ఏఈవో బాలకోటేశ్వర్లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.